క్లుప్తంగా

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించండి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్ల వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

విమాన శిఖరానికి అభిషేకం



విమాన శిఖరానికి అభిషేకం చేస్తున్న దేవస్థాన ఏసీ దంపతులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నూతన రాతి దేవాలయానికి విమాన శిఖరానికి 108 కలశాలతో దేవస్థాన ఏసీ యం. తిమ్మనాయుడు, రిషితా దంపతులు మంగళవారం అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ముఖమండపానికి విరాళాలు అందజేసిన దాతల దంపతులచే ప్రత్యేక పూజలు చేయించి సత్కరించారు.

రైల్వే గేటును ఢీకొట్టిన లారీ

- లారీని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు



దెబ్బతిన్న రైల్వేగేటును పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

చీరాల రూరల్: స్థానిక పేరాల కారంచేడు రైల్వే గేటును కారంచేడువైపు నుంచి చీరాల వస్తున్న మినీ లారీ ఢీకొట్టడంతో గేటులో సాంకేతిక సమస్యలు తలెత్తి గేటు తెరచుకోకపోవడంతో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం చీరాల కారంచేడు రైల్వేగేటు వద్ద చోటుచేసుకుంది. స్పందించిన రైల్వే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గేటును ఢీకొట్టిన లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఉదయం కావడంతో ఆఫీసు పనులకు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, చేతి వృత్తులు చేసుకునే కూలీలు గేటు మరమ్మతులకు గురికావడంతో ఇబ్బందులు పడ్డారు. అలానే గేటుకు రెండువైపులా భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోవడంతో కొన్ని గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

1755 రైతుల డేటా పరిశీలన

- ఏఓ కాశీవిశ్వనాథ్



మాట్లాడుతున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వేటపాలెం: మండల పరిధిలో 1755 రైతులకు సంబంధించిన డేటా పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి ఐ. కాశీవిశ్వనాథ్ తెలిపారు. పందిళ్లపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవపై రైతులకు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ మండల పరిధిలో 55 మంది రైతులకు సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. 600 మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపిస్తామని తెలిపారు. ప్రతి కౌలుదారుడు విధిగా పంట ధ్రువీకరణ పత్రం పొందాలని సూచించారు. అన్నదాత సుఖీభవ ఆధార్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతి రైతు వారు సాగు చేసే పంట భూమికి సంబంధించిన మట్టి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అసిస్టెంట్లు, వీఆర్ఓ, సెక్రటరీ పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం శతభిషం నక్షత్రం నవమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

శుభ్రతకు లేని భద్రత



చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఔట్ పేషెంట్ విభాగం



మందులు ఇచ్చే గదుల వద్ద మహిళా కార్మికురాలు

- ప్రభుత్వాసుపత్రిలో జీతాలు అందక పారిశుద్ధ్య కార్మికుల వెతలు
- ఆకలి కేకలతో కుటుంబాలు
- స్పందించని పాలకులు

చీరాల రూరల్: పారిశుద్ధ్య కార్మికుల వెతలు తీర్చేవారు కానరావడంలేదు. చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఈ నెలతో కలుపుకుని ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటే ఈ ప్రభుత్వ తీరు అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో నిత్యం రోగుల మధ్య చాకిరీ చేయడం తప్ప ఏనెల జీతం తీసుకుంటున్నారో కూడా తెలియని స్థితిలో వారున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాంట్రాక్టరు ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నా అధికారులు, పాలకులు చోద్యం చూస్తుండటం గమనార్హం.

పేదలకు కొండంత అండ

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక 100 పడకల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల 11 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. చీరాల నియోజకవర్గంతో పాటు పర్చూరు, బాపట్ల, అద్దంకి నియోజకవర్గాల ప్రజలు ఇక్కడకు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. కూలీనాలు చేసుకొనే పేదలకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ ఆస్పత్రేఅమ్మలా ఆదుకుంటుంది. ఇక్కడ రక్తనిధి కేంద్రంతో పాటు తల్లీ పిల్లల కాన్పుల వార్డులు, డయాలసిస్ యూనిట్, స్కానింగ్ సెంటర్, ఎక్స్‌రేలు, హెచ్ఐవీ ఏఆర్‌టీ సెంటర్, రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలైన బాధితులకు అత్యవసర చికిత్సలు అందించడం వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.

120 పడకలు.. 23 మంది కార్మికులు

పారిశుద్ధ్య విభాగం ఆస్పత్రికి గుండె వంటిది. అన్ని విభాగాలను ప్రతి రోజూ శుభ్రపరిచేందుకు కార్మికులు నిత్యం అందుబాటులో ఉండాలి. గతంలో 30 పడకలుగా ఉన్న సమయంలో 16 మంది కార్మికులు పనిచేసేవారు. అనంతరం 120 పడకలుపైగానే అప్‌గ్రేడ్ చేయడంతో వైద్యులు, వైద్య సిబ్బంది కూడా పెరిగారు. కానీ వీరికి సరిపడా కార్మికులను నియమించలేదు. సుమారు 50 మందిపైగానే విధుల్లో ఉండాల్సి ఉన్నా 23 మందితోనే నెట్టుకొస్తున్నారు. వారిలో 18 మంది మహిళా కార్మికులు కాగా.. ఐదుగురు పురుషులున్నారు. వీరిలో ఇద్దరు ఆస్పత్రి ఆరుబయట పరిసరాలను శుభ్రం చేస్తుండగా.. మరో ఇద్దరు సూపర్‌వైజర్లుగా ఉన్నారు. ఒకరు ఎలక్ట్రీషియన్. వీరంతా షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తింటారు. ప్రతిరోజూ ఉదయం వేళలో 12 మంది మహిళా కార్మికులు ఓపీ పరిసరాలు, వార్డులు, క్యాజువాలిటీ, వైద్యుల గదులు, తల్లీ బిడ్డల కాన్పుల వార్డులు శుభ్రం చేస్తుంటారు. ఉదయం 6:30 గంటలకు వీరంతా విధులకు చేరుకుని మధ్యాహ్నం రెండు గంటల వరకు పనిచేస్తుంటారు. రెండో షిఫ్టులో ముగ్గురు కార్మికులు మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అలానే మూడో షిఫ్టులో ముగ్గురు కార్మికులు రాత్రి ఎనిమిది గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6:30 గంటల వరకు పనిచేస్తారు.

సెలవు లేకుండా పనిచేస్తే రూ. 11,800 మాత్రమే..

గత నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు అందడంలేదు. ఏ నెల జీతం వస్తుందో.. ఏ నెలది తీసుకుంటున్నారో వారికి అర్థం కావడంలేదు. సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం విజయవాడ నుంచి రావాలని.. అతను ఎక్కడుంటారో తెలియదని కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం కార్మికులు నెల మొత్తం సెలవులేకుండా పనిచేస్తే రూ. 11,800 లే అందుకుంటున్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఎంత కడుతున్నారో కూడా వారికి తెలియదు. నిత్యావసర ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో రోజంతా కష్టపడి పని చేసినా ఇంటికి వెళ్లి నాలుగు మెతుకులు తినలేకపోవడం వారి పేదరికానికి తార్కాణంగా చెప్పవచ్చు. ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికులుగా సుమారు 20 ఏళ్ల సీనియారిటీ ఉన్నవారికీ జీతాలు పెంచకుండా సదరు సంస్థలు వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయి.

> **ఉన్నతాధికారులకు తెలియపరిచాం**
> పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు రాని విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. సంబంధిత కాంట్రాక్టరుతో మాట్లాడటానికి ప్రయత్నించినా అతను ఫోను తీయడంలేదు.
> – డాక్టర్ శ్రీకాంత్, ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు



విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- 21న డీఈఓ కార్యాలయ ముట్టడి జయప్రదం చేయండి



ఐక్యత చూపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

అద్దంకి: ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఐక్యోపాధ్యాయ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో మంగళవారం ఫ్యాప్టో యోజకవర్గ స్థాయి ఉపాధ్యా సంఘాల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్ల సాధన, పాఠశాలపై అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా, తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ నెల 21న ఒంగోలు డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. పాశాలల్లో ఇంగ్లిషు మీడియంతో పాటు, తెలుగు మీడియం కొనసాగించాలని, ప్రైమరీ పాఠశాలలకు ఎస్‌జీటీలను ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ కల్పించాలని డిమండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో 45 మందికి అదనపు సెక్షన్ ఇవ్వాలన్నారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వాహించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మలాది నాగరాజు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, బాబూరావు, మలిఖార్జునరావు, పూర్ణచంద్రరావు, ఎలీషా, అంకయ్య, సుబ్బారావు, రవీచంద్ర, కోటేశ్వరరావు, శ్రీహరి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి



యద్దనపూడిలో వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు



కారంచేడు తహసీల్దారు కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

యద్దనపూడి: ప్రభుత్వం నల్లబర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు రవికుమార్‌కు రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బత్తుల హనుమంతురావు మాట్లాడుతూ పొగాకు సాగుచేసిన రైతులకు ఎకరాకు లక్షన్నర వరకు ఖర్చు చేశారన్నారు. సాగుకు ముందు పండించిన పొగాకు మొత్తం తామే కొంటామని చెప్పిన కంపెనీలు పంట చేతికి వచ్చిన తరువాత కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే తాము చెప్పిన విధంగా గ్రేడింగ్ చేస్తేనే కొంటామంటూ సవాలక్ష కొర్రీలు పెడుతున్నారన్నారు. తక్షణమే నల్లబర్లీ పొగాకును కూడా పొగాకు బోర్డు కిందకు తీసుకురావాలని కోరారు. అలాగే పొగాకు గత సంవత్సరం ఇచ్చిన ధరకు తగ్గకుండా కొనుగోలు చేసేలా కంపెనీలను ఒప్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఈదల శ్రీను, గొట్టిపాటి వెంకట్రావు, యలనాటి వెంకట్రావు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు: నల్లబర్లీ పొగాకుకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి వెంటనే కొనుగోలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం నాయకులు, ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నల్లబర్లీ పొగాకుకు మంచి డిమాండ్ ఉంటుందని రైతులను, కౌలు రైతులను నమ్మించిన కంపెనీల మోసపు మాటలు నమ్మి రైతులు నిండా మునిగి పోయారన్నారు. అనంతరం తహసీల్దారు జి. నాగరాజుకు వినతిపత్రం అందించారు. పి. కొండయ్య, శ్రీనివాసరావు, ఆవులమంద వెంకటేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, హనుమంతరావు, కంచర్ల రాజు, కఠారి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా స్వర్ణమ్మ తిరునాళ్లు



తిరునాళ్లలో ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మతల్లి



అమ్మవారి దర్శనం కోసం పోటీపడుతున్న భక్తులు

స్వర్ణ(కారంచేడు): గ్రామ దేవత, భక్తుల కొంగు బంగారం, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి స్వర్ణమ్మ తల్లి 32వ తిరునాళ్లను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ చినకృపారావు, ఆలయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తిరునాళ్ళ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బొగ్గవరపు లిఖితచౌదరి, సహస్ర చౌదరిచే నిర్వహించిన కూచపూడి, వెస్టన్, ఫోక్ నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామ ఆర్య, వైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఇంకొల్లు సీఐ ఆధ్వర్యంలో కారంచేడు ఎస్సై వి. వెంకట్రావు తన సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీస్ కంట్రోల్ పాయింట్

నీటితీరువా వసూళ్లలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు నాటికి పూర్తి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహజీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా రూ.46 లక్షలు వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. రైతుల నుంచి విధిగా నీటి తీరువాను వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలని కోరారు. అలానే ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. అక్రమంగా ఇసుకను తరలించే వారి వాహనాలు సీజ్ చేయాలన్నారు. వీఆర్వోలు ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుశీల, ఇన్‌ఛార్జి ఆర్ఐలు శేఖర్, సత్యం, గ్రామ, పట్టణ వీఆర్వోలున్నారు.

గ్రంథాలయానికి స్థలం అప్పగింత

అద్దంకి: స్థానికుల పోరాటం, సాక్షి కథనాలతో ఉన్నతాధికారులు రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు గ్రంథాలయానికి 10 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మంగళవారం తహసీల్దార్ జి. చరణ్ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్పీ కార్యాలయంలో గ్రంథాలయానికి కేటాయించిన పది సెంట్ల స్థలాన్ని సర్వేయర్లతో కొలతలు వేయించి ఆ శాఖకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ స్థల కేటాయింపునకు చొరవ చూపిన అధికారులకు, నాయకులకు అభినందనలు తెలియజేశారు. భవన నిర్మాణ విషయంలో కూడా స్థానిక మంత్రి, నాయకులు, పెద్దలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ లైబ్రేరియన్ సుగుణరావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పల్లెపాటి వీరయ్య, గోవాడ శ్రీకాంత్, చన్నుపల్లి నాగేశ్వరరావు తదితరులున్నారు.



స్థలంలో హద్దు రాళ్లు పాతిస్తున్న అధికారులు

విద్యుత్ భారానికి విరుగుడు సూర్యాఘర్



మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రధాన మంత్రి సూర్యాఘర్ యోజనతో గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు బిల్లు భారం తగ్గింకోవచ్చని ఎంపీడీఓ కుసుమ కుమారి అన్నారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల సెక్రటరీలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి అవసరాల కోసం కేంద్రం ఇస్తున్న రాయితీపై గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక కిలో వాట్ ఏర్పాటు రూ. 30 వేలు, 2 కిలోవాట్‌లకు రూ. 60 వేలు, 3 కిలోవాట్‌లకు రూ. 78వేల రాయితీ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు మండలానికి కేటాయించిన కోఆర్డినేటర్ రాజేష్ (9502477778)ను సంప్రదించాలని వివరించారు. డిప్యూటీఎంపీడీవో దాసరి సుమతి పాల్గొన్నారు.

విగ్రహ వార్షికోత్సవం రేపు

పర్చూరు(చినగంజాం): పర్చూరు కపిస్థలిలోని అభయాంజనేయ స్వామి విగ్రహ, దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమం, హనుమజ్జయంతి 22వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, విశేష అర్చన, ఉత్సవ మూర్తికి పురుష సూక్త విశేష అర్చనలు, శ్రీరామ రక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణ, నాగవల్లి దళ సహిత అష్టోత్తర శత నామావళి నిర్వహించనున్నట్లు తెలిపారు.

దార్శనికుడు ప్రకాశం పంతులు



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆయన మునిమనుమరాలు

అద్దంకి: దార్శనికుడు, నిస్వార్థపరుడు ప్రకాశం పంతులు అని ఆయన మునిమనుమరాలు సుభాషిణి అన్నారు. పట్టణంలోని బంగ్లా రోడ్‌లో ప్రకాశం విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రకాశం వర్ధంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ధైర్య సాహసాలకు మారు పేరు ప్రకాశం పంతులన్నారు. ప్రకాశం మిత్రమండలి కార్యదర్శి షేక్ మహ్మద్ రఫీ, కోశాధికారి ఊటుకూరు రామకోటేశ్వరరావు, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, వీరవల్లి సుబ్బారావు, చప్పిడి వీరయ్య, చుదూరి మురళీ సుధాకర్‌రావు, మలాది శ్రీనివాసరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపులో 14 మందికి వైద్య పరీక్షలు



సదరమ్ క్యాంపులో రోగి కంటిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

చీరాల రూరల్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం క్యాంపులో 14 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. వాటిలో కంటికి సంబంధించి ఏడు మంది రోగులకు, ఎముకలకు సంబంధించి ఏడుగురికి వైద్యులు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. గతంలో వారానికి రెండుసార్లు సదరం క్యాంప్ నిర్వహించేవారని ప్రస్తుతం వారాని ఒక్కసారి మాత్రమే మంగళవారం నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. రోగులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

యద్దనపూడి: ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తుందని వ్యవసాయాధికారి మేరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ విత్తనాలు అసలు ధర కిలో రూ. 123 కాగా రూ.61.50కు, జనుము విత్తనాలు రూ.109 గాను రూ.51.50కు రైతులకు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. పొలం పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

పీఎంజేఏవై కార్డుతో మెరుగైన సేవలు



కార్డుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చినగంజాం: పీఎంజేఏవై కార్డుల తీసుకోవడం ద్వారా దేశంలో ఎక్కడైనా మెరుగైన వైద్యసేవలు పొందవచ్చని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె. కీర్తి సరోజ్ అన్నారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎంపీపీ పాఠశాలలో ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకానికి సంబంధించి మంగళవారం కార్డుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ బృందం పాల్గొన్నారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి కె. కీర్తి సరోజ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైతే 70 సంవత్సరాలు కలిగిన వారు తప్పనిసరిగా పీఎంజేఏవై కార్డులు తీసుకొని దేశంలో ఎక్కడైనా రూ. 5 లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చని తెలిపారు. 500 మందికి పైగా పీఎంజేఏవై కార్డుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి కె. కృపారావు, వైద్య సిబ్బంది సూపర్ వైజర్ యు. వెంకటరమణ, శ్రీధర్, మాధవి, వరదానం పాల్గొన్నారు.

బొబ్బేపల్లి, రాజుగారి పాలెం తిరునాళ్లు రేపు

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి రాజు గారి పాలెం పొలిమేరలో వెంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ 38వ తిరనాళ్లు గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీ సువర్చలా సహిత వీరాంజనేయ స్వామి కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఎడ్ల ప్రదర్శన.. కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.